బెంబేలెత్తిస్తున్న కుక్కలు

- గుంపులుగా తిరుగుతున్న శునకాలు
- స్కూల్‌కు, వాకింగ్‌కు, బైక్‌పై వెళ్లే వారి వెంట పడుతున్న వైనం
- బయటకు వెళ్లాలంటే జంకుతున్న జనం
- మున్సిపల్ యంత్రాంగం చర్యలు శూన్యం



బస్వాగార్డెన్ వద్ద సంచరిస్తున్న వీధి కుక్కలు

నిజామాబాద్ సిటీ: వీధి కుక్కలు ప్రజలకు చుక్కలు చూపుతున్నాయి. ప్రజలు కుక్కలు ఉన్న మార్గంలో వెళ్లాలంటేనే జంకుతున్నారు. తమ దారి తాము పోతుంటే కుక్కలు వెంట పడుతూ భయపెడుతున్నాయి. కొన్ని సందర్భాలలో అయితే మీదకు వస్తుండటంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయంలోనే కాకుండా పట్టపగలు కూడా కుక్కలకు భయపడి వీధుల్లోకి వెళ్లలేకపోతున్నారు. ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. నగరంలోని బస్వాగార్డెన్, మహాలక్ష్మీనగర్, బ్యాంక్ కాలనీ, రామకృష్ణానగర్ కాలనీలలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. స్కూల్, యోగా, కరాటే క్లాస్‌లకు వెళ్లే చిన్నపిల్లల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తెల్లవారుజామున రోడ్డుపై ఒంటరిగా వచ్చే పిల్లల వెంట కుక్కలు పడుతున్నాయి. చిన్నారులను పాఠశాలలకు పంపాలన్నా బయటకు పంపాలన్నా తల్లిదండ్రులు భయపడుతున్నారు. గతంలో కుక్కలను నియంత్రించే చర్యలు చేపట్టిన అవి తూతూ మంత్రంగా ఉండటంతో మళ్లీ కుక్కలు పెరిగిపోయాయి. ఒక్కో కుక్క సంవత్సరంలో రెండుసార్లు పిల్లలు పెడుతుండటంతో కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా తమ గోడును పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు.

గుంపులుగా సంచరిస్తున్నాయి



వినాయక్‌నగర్, బస్వాగార్డెన్ ప్రాంతాలలో వీధి కుక్కలు ఉన్నాయి. ముఖ్యంగా పార్కుల వద్ద కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఉదయాన్నే వాకింగ్ వెళ్దామంటే ఎటునుంచి కుక్కలు వచ్చి మీద పడుతాయోనని పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో బైక్‌లపై వెళ్లే వారి వెంట పడుతున్నాయి.

– టి. సరేశ్, వినాయక్‌నగర్

పెద్దలు కూడా భయపడుతున్నారు



బస్వాగార్డెన్, రామకృష్ణానగర్ ప్రాంతాలలో చాలా కుక్కలు తిరుగుతున్నాయి. వీటి వల్ల పిల్లలు, పెద్దలు చాలా భయపడుతున్నారు. ముఖ్యంగా ఉదయాన్నే వివిధ శిక్షణ తరగతులకు వెళ్లే పిల్లల వెంట కుక్కలు వెంట పడుతున్నాయి. కొన్ని సందర్భాలలో పిల్లలను కరిచిన ఘటనలు ఉన్నాయి. అధికారులు కుక్కలను వెంటనే నియంత్రించాలి.

– మనోజ్ కుమార్, బస్వాగార్డెన్ ప్రాంతం

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



దేవేందర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



నితిన్‌తో ఉపాధ్యాయులు

నిజామాబాద్ రూరల్(డిచ్‌పల్లి): ఈ నెల 11న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(ఆర్మూర్) క్రీడా మైదానంలో జరిగిన జిల్లా సబ్ జూనియర్ జట్టు ఎంపికలో పాఠశాల క్రీడాకారుడు బూక్య దేవేందర్ పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 23 నుంచి 24 వరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో జరగబోయే 8వ రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగా మోహన్ శుక్రవారం తెలిపారు. బూక్య దేవేందర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్, ఉపాధ్యాయులు రాజశేఖర్, రాఘవేందర్, పోశెట్టి, బాల్ రాజ్ అభినందించారు.

చీమన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి..

సిరికొండ: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు చీమన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన నితిన్ అనే విద్యార్థి ఎంపికైనట్లు పీఈటీ నవీన్ తెలిపారు. ఆలేరులో ఈ నెల 23 నుండి జరిగే సబ్ జూనియర్ అండర్–14 విభాగంలో పాల్గొంటాడని తెలిపారు. నితిన్‌ను హెచ్‌ఎం శ్రీనివాస్, పీఈటీ అభినందించారు.

నూతన వసతి గృహం నిర్మించాలి

తెయూ ఏబీవీపీ నేతల డిమాండ్



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నేతలు

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): నూతనంగా బాలికల వసతి గృహం నిర్మించాలని కోరుతూ ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ బాలికల వసతి గృహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. ఒకే గదిలో 8 నుంచి 10 మంది విద్యార్థినిలు ఉండడం వల్ల వారికి చదవడం ఇబ్బంది అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, యూనివర్సిటీ రిజిస్ట్రార్లు తక్షణమే చొరవ తీసుకొని అదనంగా మరొక బాలికల వసతి గృహాన్ని నిర్మించాలని కోరారు. అలాగే యూనివర్సిటీలో ఒక్క మహిళా పీఈటీ లేకపోవడం వల్ల విద్యార్థినులు క్రీడలకు దూరమవుతున్నరన్నారు. వసతి గృహంలో తాగు నీటి సమస్య ఉన్నా అధికారులు స్పందించడంలేదన్నారు. నిరసనలో ఏబీవీపీ నేతలు అమృత్, పావని, అనిల్, మణి, మహర్షి తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ మృతి ఉద్యమానికి తీరని లోటు



నగరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

సిరికొండ: ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు కిరణ్ మృతి కార్మిక విప్లవోద్యమానికి తీరని లోటని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు దామోదర్, లింబాద్రి, రమేష్, పండరి, కాశీరాం, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో..

ఖలీల్‌వాడి: ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని కోటగల్లిలో కిరణ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న ఎం.సుధాకర్ లు మాట్లాడుతూ.. కిరణ్ మరణం కార్మిక వర్గానికి, ముఖ్యంగా ఆటో కార్మిక వర్గానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్, ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయగౌడ్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలి



నిజామాబాద్ రూరల్: విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలని పంచాయతీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గుండారంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామ కార్యదర్శి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని గిరిజన కళాశాల విద్యార్థులు గుండారం గ్రామానికి వచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేశారు.

పోరాటాలకు విశ్వవిద్యాలయాలే కేంద్రం కావాలి



సదస్సులో మాట్లాడుతున్న నామాల ఆజాద్

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): పోరాటాలకు విశ్వవిద్యాలయాలే కేంద్రం కావాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ, పీవైఎల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ సెమినార్ హాల్లో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నామాల ఆజాద్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూస్తుందన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసేందుకు విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుమతి ఇచ్చిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక సంస్కరణలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తెయూ ప్రొఫెసర్ డాక్టర్ పున్నయ్య మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్లో విద్యా రంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ప్రశ్నించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ దత్తహరి మాట్లాడుతూ.. యూనివర్సిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడంపై విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, పీవైఎల్ అధ్యక్ష, కార్యదర్శులు అనీష్, నవీన్, నేతలు అనిల్, నిఖిల్, మమత, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్సపల్లి మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి



సన్మానిస్తున్న మున్నూరు కాపు కార్యవర్గ సభ్యులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని అర్సపల్లి మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ సీనియర్ నేత కులాచారి వెంకటేష్ అన్నారు. శుక్రవారం మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఏర్పడిన సందర్భంగా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి రూ. 20 లక్షల వరకు మంజూరు చేయించానని, ఈ ఏడాది రూ.10 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్సపల్లి మున్నూరు కాపు పెద్దలు సిర్ప లింగం, సంఘం నూతన అధ్యక్షుడు నర్సయ్య, సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



సుభాష్‌నగర్: మహిళలు స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని రాణించాలని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సంఘటన మంత్రి సత్యం సూచించారు. నగరంలోని వీహెచ్‌పీ కార్యాలయంలో విశ్వ హిత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం సత్యం మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రాంత సహ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, ప్రాంత ధర్మ ప్రసార ప్రముఖ్ వెంకటేశ్వర్ జాదవ్, విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, కార్యదర్శి గాజుల దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



నిజామాబాద్‌నాగారం: పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీతారాంనగర్ సెక్టార్‌లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అంగన్‌వాడి సిబ్బంది అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సీమంతాలు నిర్వహించారు. కార్పొరేటర్ సాయివర్ధన్, వెల్డింగ్ నారాయణ, లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



వెంకటరమణకు డాక్టరేట్ అందజేస్తున్న ప్రొఫెసర్లు

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఇప్ప వెంకటరమణ అనే విద్యార్థికి శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆచార్య నసీం పర్యవేక్షణలో ఇప్ప వెంకట రమణ 'సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ డ్రగ్ లోడెడ్ పాలిమెరిక్ మ్యాట్రిక్స్ ఎన్కాప్సిలేటెడ్ విత్ నానో పార్టికల్స్ ఫర్ డ్రగ్ డెలివరీ అండ్ ఫార్మాస్యూటికల్ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధక గ్రంథాన్ని తెలంగాణ యూనివర్సిటికి వెంకట రమణ సమర్పించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రామచందర్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. పరిశోధక విద్యార్థి ఇప్ప వెంకట రమణ తన పరిశోధనను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వర్సిటీ అధికారులు సంతృప్తి చెంది ఆయనకు డాక్టరేట్ అవార్డును ప్రకటించారు. రిజిస్ట్రార్ యాదగిరి, డీన్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ శిరీష బోయపాటి, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సన్మానం



నిజామాబాద్ సిటీ: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారం అవార్డు అందుకున్న మేడిచర్ల ప్రభాకర్ రావును తెలంగాణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిరణ్ కుమార్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రొట్టె సురేష్ శర్మ, కోశాధికారి పుల్కల్ రమేష్, లక్ష్మణ, వైరాగర్, అప్పల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	68,000	వెండి (కిలో)	78,400
22 క్యారెట్స్	62,715		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)


	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	08	16	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	10	20	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	50	70	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఓం భీమ్ బుష్ (తెలుగు) - 1.45, 7.30, 10.30, ప్రేమలు (తెలుగు) - 4.30
స్క్రీన్-2	రజాకార్ (తెలుగు) - 10.25, 4.30 లైన్‌మన్ (తెలుగు) - 1.40, భీమా - 7.40, ప్రేమలు (తెలుగు) - 10.30
స్క్రీన్-3	రజాకార్ (తెలుగు) - 1.40, 10.40, లైన్‌మన్ - 7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఓం భీమ్ బుష్ (తెలుగు) - 3.50, 10.15, ప్రేమలు (తెలుగు) - 7.00, సైతాన్ (హిందీ) - 12.50
స్క్రీన్-2	కుంగ్ ఫూ పాండా (ఇంగ్లీష్) - 5.10, 7.30, ప్రేమలు (తెలుగు) - 1.30 సైతాన్ (హిందీ) - 9.50
స్క్రీన్-3	లైన్‌మన్ (తెలుగు) - 7.10, 10.00, యమధీర (తెలుగు) - 1.10, యోధ (హిందీ) - 4.10
స్క్రీన్-4	గామి (తెలుగు) - 3.20 రజాకార్ (తెలుగు) - 12.05, 6.30, 9.45
దేవి	ప్రేమలు (తెలుగు)
నటరాజ్	నువ్వు నేను (తెలుగు)
లలితామహల్	ఓం భీమ్ బుష్ (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)

క్లుప్తంగా

ఆదిలాబాద్ పార్లమెంట్ సహ కో-ఆర్డినేటర్‌గా స్వామి యాదవ్



సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ ఓబీసీ మోర్చా ఆదిలాబాద్ పార్లమెంట్ సహ కో–ఆర్డినేటర్‌గా సీనియర్ నాయకులు మాదాసు స్వామి యాదవ్‌ను మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతను శక్తి వంచన లేకుండా నిర్వహిస్తానని, రాబోయే ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంపై బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. తనపై నమ్మకముంచి బాధ్యతను అప్పగించిన ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే, ఓబీసీ మోర్చా ఇన్‌ఛార్జి యెండల లక్ష్మీనారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోండి



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మ్యారేజ్ బ్యూరో ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 24న(ఆదివారం) నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఉంటుందని గౌరవ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని కులాల వారికి వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరవుతారన్నారు. అధ్యక్షుడు తిరుపతి, ఉపాధ్యక్షుడు కె.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ సొసైటీ ఎన్నికల అధికారుల నియామకం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా అడ్వకేట్స్ పరస్పర సహకార సొసైటీకి ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా సీనియర్ న్యాయవాదులు ఎర్రం విగ్నేష్, శైలేష్ కుమార్‌లను ఎన్నికల అధికారులుగా నియమించినట్లు సొసైటీ అధ్యక్షుడు వెంకట రమణ గౌడ్, కొండడోళ్ల శ్రీనివాస్ శనివారం తెలిపారు. నాలుగు డైరెక్టర్ పదవులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను భర్తీ చేయడానికి వారు నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



ధర్పల్లి: రామడుగు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. ఉచితంగా పేస్టులు, బ్రష్‌లు అందించారు.

మాల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల తెలంగాణ మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తలారి హేమంత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మాల కార్పొరేషన్‌కు రూ. 1000 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. మండలాధ్యక్షుడు రాజేశ్వర్, సుమన్, రాకేష్, హరీష్, నిఖిల్, గంగారాం పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

సిరికొండ: నీటిని వృథా చేయవద్దని, అదా చేస్తేనే భవిష్యత్తులో నీటి ఇబ్బందులు తలెత్తవని ప్రిన్సిపాల్ నర్సయ్య అన్నారు. సిరికొండలోని సత్యశోధక్ పాఠశాలలో జల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు నీటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

వాటర్‌డేపై సాండ్ ఆర్ట్



నిజామాబాద్‌నాగారం: ప్రపంచ వాటర్ డే సందర్భంగా జేసీఐ ఇందూరు ప్రెసిడెంట్ మనోజ్‌కుమార్ సాండ్ ఆర్ట్ వేశారు. సేవ్ వాటర్, సేవ్ బర్డ్స్, సేవ్ ట్రీస్ అని సాండ్ ఆర్ట్‌తో సందేశం ఇచ్చారు.


సంక్షిప్తం

కవికి సన్మానం



నిజామాబాద్ సిటీ: ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా గత గురువారం రాత్రి హైదరాబాద్ కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్లో భారత సాహిత్య అనువాద పరిషత్, విమల సాహిత్య సమితి సంయుక్త నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనం హృద్యంగా సాగింది. నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ కవి ఘనపురం దేవేందర్ ఈ కవి సమ్మేళనంలో 'అస్తిత్వం' అనే కవితను చదివి అందరి మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దేవేందర్‌ను ఘనంగా సన్మానించారు.

సీఎంను కలిసిన మానాల



ఖలీల్‌వాడి: సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీప్‌దాస్‌మున్షీని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణు రాజ్, నిఖిల్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఖుద్వాన్‌పూర్ ఆపరేటర్‌పై సస్పెన్షన్ వేటు

నిజామాబాద్‌నాగారం: నందిపేట్ మండలంలోని ఖుద్వాన్‌పూర్ పరిధిలో ఉన్న సబ్‌స్టేషన్ ఆపరేటర్ మోహన్ విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు నిజామాబాద్ ఆపరేషన్ డీఈ శ్రీనివాస్‌రావు శుక్రవారం సస్పెన్షన్ చేశారు. ఈ నెల 20న డీఈ నందిపేట ఏడీఈ అశోక్‌తో కలిసి మండలంలో తనిఖీలకు వెళ్లినప్పుడు ఖుద్వాన్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడ విధుల్లో ఉండాల్సిన ఆపరేటర్(ఆర్టిజన్) మోహన్ దుమ్మాకొట్టడమే కాకుండా తనకు బదులుగా ప్రైవేట్ వ్యక్తితో విధులు చేయిస్తున్నట్లు దృష్టికి వచ్చింది. ఆరా తీయగా కొన్ని రోజులుగా మోహన్ విధులకు రాకుండా ప్రైవేట్ కాంట్రాక్టర్‌గా దర్జాగా పనులు చేసుకుంటున్నారని తెలిసింది. విచారణలో నిజమని తేలడంతో సస్పెన్షన్ విధించారు.

రేపు కామదహన యజ్ఞ హోలీ మహోత్సవం

నిజామాబాద్ సిటీ: నగరంలోని గాంధీచౌక్‌లో రేపు(ఆదివారం) సాయంత్రం 5.30 గంటలకు కామదహన యజ్ఞ హోళిమహోత్సవము కార్యక్రమం జరుగుతుందని ఆర్యసమాజ్ అధ్యక్షుడు కరిపె సూర్యప్రకాష్ తెలిపారు. సామాజిక, ధార్మిక విజ్ఞాన సేవా సంస్థ ఆర్య సమాజము ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో యజ్ఞ బ్రహ్మ ఆచార్య వేదమిత్ర వేదార్థి, ముఖ్య వక్త ప్రణవ కుమార అర్ష కవిలు హాజరుకానున్నారని ఆయన తెలిపారు.


సౌండ్ సిస్టం వితరణ

ధర్పల్లి: రామడుగులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మైత్రివనం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.15 వేల విలువగల సౌండ్ సిస్టంను శుక్రవారం స్వచ్ఛంద సంస్థ సభ్యులు అందజేశారు. పేద విద్యార్థులకు మంచి విద్య అందించడమే ఈ సంస్థ ముఖ్య ఉద్దేశమని సంస్థ సభ్యులు తెలియజేశారు. మైత్రివనం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు వెంకట్ రాజారెడ్డి, సతీష్ ఉన్నారు.

ముందుకు కదిలిన మురుగు

సాక్షి ఎఫెక్ట్..

నగరంలోని గాయత్రినగర్



స్మశానవాటికను ఆనుకొని పూలాంగ్‌కు వెళ్లే మురికి కాలువ వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లతో నిండి పోయింది. ఈ విషయం గురించి సాక్షిలో కథనం ప్రచురించడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను కార్మికులతో తొలగించారు. దీంతో మురికి కాలువ ప్రవాహం ముందుకు కదిలింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్